# ప్రక్క ఫ్లాటు కుర్రాడు

కాలింగ్ బెల్ శబ్దం విని తలుపు తెరిచింది కల్పన.

ప్రక్క ఫ్లాటు కుర్రాడు నిలబడివున్నాడు. ఏం కావాలన్నట్లు చూసింది అతని వైపు.

"వేడినీళ్లు..." చేతిలోని ఫ్లాస్కును చూపిస్తూ అన్నాడు.

"త్రాగడానికా?"

అవునన్నట్లు తలూపాడు.

ఫ్లాస్క్ అందుకుని వంటగదిలోకి వెళుతూ "కూర్చో..." అంది సోఫావైపు చేయి చూపిస్తూ.

అతను కూర్చోలేదు. జేబులోని సెల్ చేతిలోకి తీసుకుని చూసుకుంటున్నాడు.

కల్పన నీళ్లు స్టౌమీద కాచి, ఫ్లాస్కులో పోసి అతనికి యివ్వడానికి వస్తూంటే... ఆమె కొడుకు శిరీష్ గదిలోంచి బయటికొచ్చి "అమ్మా! అక్కయ్య ఫోనులో దొరకడం లేదు" అన్నాడు.

"అయ్యోఁ... ఇంత వర్షంలో ఎక్కడుందో అది?" అంది కల్పన ఆందోళనగా.

"మీ అమ్మాయి ఎక్కడ్నుంచి రావాలి?" ప్రక్కింటి కుర్రాడు ఆమెను అడిగాడు.

చెప్పింది కల్పన.

"మీ అమ్మాయి రావడానికి అర్ధరాత్రవుతుంది. అటుప్రక్క వాననీళ్లు రోడ్డును నింపేస్తే ట్రాఫిక్ ఆగిపోయిందట! నీళ్లు క్లియర్ చేయడానికి చాలాసేపు పడుతుందట!"

"అయ్యోఁ... మరి ఎలాగ..?!" అంటూ ఏదో అనబోతున్న కల్పన– అతను తన మాటలు వినకుండా వెళ్లిపోవడం చూసి ఆశ్చర్యపోయింది.

'ఈ కాలం పిల్లలకు తమ పని అయితే చాలు– ఇంకొకరి బాధ వాళ్ళకు అక్కర్లేదు!' అనుకుంది కోపంగా.

ఆ రాత్రి పదకొండు గంటలకు కూతురు శిల్ప ఇల్లు చేరింది. అంతవరకూ టెన్షన్‌తో గడిపింది కల్పన.

కూతుర్ని చూడగానే "ఏమిటే... నీవెక్కడున్నావో ఒక ఫోన్‌కాల్ చేయడానికేమొచ్చింది నీకు? ఎంత టెన్షన్ అనుభవిస్తున్నానో తెలుసా?" అంది కన్నీళ్లతో.

"నా ఫోన్‌లో ఛార్జి అయిపోయిందే!"

"నీ ఫ్రెండ్స్ సెల్ నుంచి చేయొచ్చుగా? లేదా కాయిన్ బాక్స్ ఫోన్‌లు ఎన్ని లేవు?"

"రోడ్డుమీద మనిషిలోతు నీళ్లుంటే కాయిన్ బాక్స్ ఫోన్‌లు ఎక్కడ దొరుకుతాయి నాకు? పైగా 'ఇల్లెలా చేరాలా...' అని నా టెన్షన్‌లో నేనున్నాను. నీకు ఫోన్ చెయ్యాలని నాకు తోచలేదు, సరేనా! ఇక నన్ను వదిలేయ్!" అని విసుగ్గా లోపలికి వెళ్లింది శిల్ప.

'ఆ ప్రక్క ఫ్లాటు అబ్బాయిలాగే యిదీను! వీళ్ళ ఇబ్బందుల గురించే వీరి ఆలోచన. మరొకరి యిబ్బంది గురించి ఆలోచించరు వీళ్ళు!' అనుకుంది కల్పన బాధగా.

●

మరోసారి సిటీలో ఉన్నట్టుండి కర్ఫ్యూ విధించారు.

అప్పుడూ శిల్ప గురించి ఎంతో ఆందోళన పడింది కల్పన. తర్వాత పోలీసుల సహాయంతో శిల్ప ఇల్లు చేరడంతో ఆమె మనసు కుదుటపడింది.

అప్పట్నుంచీ శిల్ప ఇల్లు చేరేవరకూ ప్రతిరోజూ ఆందోళనతోనే గడపసాగింది కల్పన. శిరీష్ స్కూలు ఇంటికి దగ్గరే కాబట్టి అతని గురించి ఆమెకు దిగులు లేదు. ఇంటినుంచి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉండే ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్న శిల్ప గురించే ఆమె ఆలోచన. ఆమె భర్త వరంగల్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారాలు మాత్రమే అతను ఇంటివద్ద ఉంటాడు.

శిల్ప కాలేజీ నుంచి రావడానికి ఆలస్యమయ్యే పక్షంలో తనకు ఫోన్ చేసి చెప్పాలని కూతురి దగ్గర మాట తీసుకుంది కల్పన. అప్పట్నుంచీ ఆమె ఆందోళన కాస్త తగ్గింది.

ఓరోజు శిల్ప– తను కాలేజీ అయ్యాక అట్నుంచటే ఎగ్జిబిషన్‌కి వెళతాననీ, ఏ విషయం సాయంత్రం ఫోన్ చేసి చెబుతాననీ... తల్లితో చెప్పింది.

"సాయంత్రం నేను బాబా గుడికి వెళుతున్నానే! ఈరోజు గురువారం కదా... నేను ప్రక్కింటి అబ్బాయిని అడిగి అతని సెల్ నంబర్ కనుక్కుంటాను. నువ్వు ఎగ్జిబిషన్‌కి వెళ్లే పక్షంలో అతనికి ఫోన్ చేసి చెప్పు. నేను ఇంటికొచ్చాక అతను నాకు చెబుతాడు. నీ సెల్‌కి ఒకపట్టాన లైన్లు దొరకవు" అంది కల్పన.

"నేను అతనికెందుకు చేస్తాను? అతనితో నాకు పరిచయం లేదు. నేనతనికి ఫోన్ చెయ్యను."

"ఇప్పుడు నాతో వచ్చావంటే అతన్ని నీకు పరిచయం చేస్తాను. నేను అతనికి చిన్న చిన్న సహాయాలు చేస్తూంటాను. ఈరోజు అతను మనకు చేస్తాడు."

"అతనేం చెయ్యక్ఖర్లేదు. నువ్వు ఎందుకు సహాయాలు చేస్తావు? ఈ కాలం మనుషులు కొంత చనువిస్తే నెత్తికెక్కుతారు."

"అతను అలాంటివాడు కాదే! వినయంగా ఉండడు కాని, ఒక్క పదం కూడా అనవసరంగా మాట్లాడడు. పాపం... ఒంటరిగా ఉంటున్నాడు. వండుకుని తింటున్నాడో, హోటల్‌లో తింటున్నాడో కూడా నేను అడగలేదు. ఓ ఆదివారం అతన్ని భోజనానికి పిలవాలి."

"నీకంతగా పిలవాలనుకుంటే సోమవారం పిలువు... నేను ఇంట్లో ఉండను. అవునూఁ... అతను ఎప్పుడూ మేమెవరం ఇంట్లో లేనప్పుడే వస్తాడు. అతనికి ఉద్యోగం లేదా?"

"ఉందే... కాల్ సెంటర్‌లో ఉద్యోగమట! రాత్రంతా పని ఉంటుందట. పగలంతా ఇంట్లోనే ఉంటాడు. సాధారణంగా బయటకి రాడు. ఏదైనా అవసరమైతే నన్ను అడుగుతాడు. ఈ బిల్డింగ్‌లో యింకెవరితోనూ పరిచయం లేదు అతనికి."

"అదే నేను చెప్పేది కూడా! బీ ఎ రోమన్ ఇన్ రోమ్. అందరిలాగే నువ్వూ ఉండు. ఎవరైనా సహాయం అడిగితే చాలు- ఎగురుకుంటూ వెళ్లి చేస్తావు."

"అది మా అమ్మానాన్నలు నాకు నేర్పిన సంస్కారం. చిత్తూరులో మా ఇంటికి ఎవరొచ్చినా మా అమ్మ ముందుగా మంచినీళ్లిచ్చేది. తర్వాత ఫలహారం, స్వీటు... ఇలా ఇంట్లో ఏదుంటే అది యిచ్చేది. మా నాన్నగారు వీధిలో ఎవరు కొత్తగా వచ్చి చేరినా వెళ్లి పరిచయం చేసుకుని మా ఇంటికి ఆహ్వానించేవారు. వాళ్ళకు ఏ సహాయం అవసరమయినా తనను అడగమనేవారు. గ్యాస్ ట్రాన్స్‌ఫర్, రేషన్ కార్డు, పిల్లల స్కూలు అడ్మిషన్లు, వైద్యం... యిలాంటి విషయాల్లో తన సలహాలు, సహాయాలు అందజేసేవారు. ఆయన చనిపోయిన రోజు ఊరి జనమంతా మా ఇంట్లో ఉన్నారు. మాతోపాటు ఏడ్చారు. మనిషి జీవితానికి సార్థకత అదే! మనం పోయాక మనకోసం ఏడ్చేవాళ్ళుంటే అన్నాళ్లూ మనం బ్రతికినందుకు పరమార్థం ఉన్నట్లే!"

"అబ్బఁ...అమ్మా... నువ్వెళ్లి అతని ఫోన్ నంబరు తీసుకురా! నీ ఫ్లాష్‌బ్యాక్ వినడం కంటే అతనికి ఫోన్‌చేసి చెప్పడమే నయం లాగుంది."

కల్పన ఎంతో బాధపడింది కూతురి మాటలకు.

'ఎందుకు పిల్లలు యిలా మనసు విరిగేటట్టు మాట్లాడుతారు? తన తల్లిదండ్రుల గురించి తన పిల్లలతో చెప్పుకోవడం కూడా తప్పేనా? అమ్మమ్మ, తాతయ్యల గొప్పతనం గురించి వినే సహనం కూడా లేదా వీళ్ళకి? ఎక్కడుంది లోపం? తన పెంపకంలోనా? వీరి చదువులు యిచ్చిన అహంకారమా? లేక సినిమాల ప్రభావమా?' అనుకుంటూ వెళ్లి ప్రక్క ఫ్లాటు కాలింగ్ బెల్ నొక్కింది.

అతను తలుపు కొద్దిగా తెరిచి కల్పనను చూసి మళ్లీ తలుపేసుకున్నాడు.

తల కొట్టేసినట్లయింది ఆమెకు. చాలా అవమానంగా ఫీలైంది. 'తనతో శిల్ప రాకపోవడమే మంచిదైంది. లేకుంటే యితని ట్రీట్‌మెంట్ చూసి తనమీద ఎగురుండేది' అనుకుంది.

రెండు నిముషాలు నిలబడి యిక వెళ్లిపోదామనుకుంటూంటే... అతను బయటకి వచ్చి ఏం కావాలన్నట్టు చూశాడు.

ఆమె విషయం చెప్పింది. అతను ఓ నిమిషం యిబ్బందిగా చూశాడు. తర్వాత "రాసుకోండి..." అన్నాడు.

అతను నంబరు చెబితే తనతో తెచ్చుకున్న కాగితంపై నంబరు రాసుకుంది. తర్వాత అతనికి 'థాంక్స్' చెబుదామని తలెత్తి చూస్తే... అప్పటికే అతను లోపలికి వెళ్లి తలుపేసుకున్నాడు.

ఆమె ఆశ్చర్యంగా ఓ క్షణం అక్కడే నిలబడిపోయింది. 'ఇతను శిల్ప చెప్పినట్లే ప్రవర్తిస్తున్నాడు. తను అతనికన్నా వయసులో కనీసం పదిహేనేళ్లు పెద్దదయి ఉంటుంది. చిన్న చిన్న సహాయాలు కూడా చేసింది. అయినా తనను ఇంట్లోకి పిలిచి కుర్చీలో కూర్చోబెట్టి మాట్లాడే సంస్కారం కూడా ఇతనికి లేదు' అనుకుని బాధపడింది.

●

ఆ రోజు సాయంత్రం గుడి నుంచి తిరిగొచ్చిన కల్పనకు అతను ఇంటి బయటే కనిపించాడు.

"అమ్మాయి ఫోన్ చేసిందా?" ఆత్రంగా అడిగింది అతన్ని.

"లేదండీ... చేయలేదు."

ఇంట్లోకెళ్లాక ల్యాండ్‌ఫోన్ నుంచి కూతురి సెల్‌కి ఫోన్ చేసింది.

"అమ్మా... నేను ఎగ్జిబిషన్‌లో ఉన్నాను" అంది శిల్ప.

"ఆ అబ్బాయి సెల్‌కి ఫోన్ చేయమని చెప్పాను కదా... చెయ్యలేదేం?" కోపంగా అడిగింది కల్పన.

"నేను రెండుసార్లు చేశాను. రాంగ్ నెంబరు వచ్చింది. నీ ఫ్రెండు నంబరు సరిగ్గా చెప్పాడో, లేదో కనుక్కో... ఉంటాను!"

కల్పన కుర్చీలో కూర్చుని ఆలోచిస్తూండిపోయింది.

'అతను ఎందుకలా నంబరు తప్పుగా చెప్పాడు? ఆపాటి సహాయం చెయ్యడం కూడా అతనికి యిష్టంలేదా? లేదా తను నంబరు తప్పుగా రాసుకుందా? లేదు. శిల్ప తిడుతుందన్న భయంతో తను జాగ్రత్తగా విని రాసుకుంది. బహుశా శిల్ప నంబరు తప్పుగా సేవ్ చేసుకుని ఉండొచ్చు!' అనుకుంది.

వెంటనే ఆమెకు ఓ ఆలోచన వచ్చి చెత్తబుట్టలో ఉదయం ఫోన్ నంబరు రాసుకున్న కాగితం వెతికితీసి ల్యాండ్‌ఫోను నుంచి ఆ నంబరుకు డయల్ చేసింది.

ఎవరో స్త్రీ ఫోన్ తీయడంతో రిసీవర్‌ను క్రెడిల్ చేసింది.

●

ఓ రోజు టీవీలో వార్త చూసి గాబరాపడింది కల్పన.

సిటీలో ఆరుచోట్ల బాంబులు ప్రేలాయి. పదుల సంఖ్యలో జనం మరణించారు. వందల సంఖ్యలో గాయపడ్డారు.

బాంబులు ప్రేలిన ప్రదేశాల వివరాలు చూస్తున్న ఆమెలో ఆందోళన మరింత పెరిగింది. కారణం... బాంబు ప్రేలిన ప్రదేశాల్లో ఓ సినిమా థియేటరు కూడా ఉండటం! ఆ థియేటరుకే శిల్ప సాయంత్రం ఆటకు వెళ్లి ఉండటం!!

వెంటనే శిల్ప సెల్‌కి ఫోన్ చేసింది.

రింగ్ అవుతోంది కాని, ఎవరూ తీయడం లేదు. ఆమె ఆందోళన ఏడుపుగా మారి గట్టిగా రోదించసాగింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరైనా ఉండివుంటే బాగుండేదనిపించింది ఆమెకు. శిరీష్ కూడా ఇంట్లో లేడు.

భర్తకు ఫోన్ చేసి చెప్పాలని ఆమెకు ఓ క్షణం అనిపించింది. అయితే దానివల్ల అతన్ని కూడా ఆందోళనకు గురిచెయ్యడం తప్ప మరో ఉపయోగం ఉండదనిపించింది. 'ఊర్లో ఉన్న ఆయన స్నేహితుల సహాయం తీసుకుని శిల్ప ఎక్కడుందో కనుక్కోవాలి!' అనుకుంది.

ఇంతలో... ఫోను మ్రోగితే రిసీవరు తీసింది. అవతలి వ్యక్తి మాటలు విన్నాక శిలలా నిలబడిపోయింది.

బాంబు ప్రేలుళ్ళలో శిల్ప కాలికి తీవ్రంగా గాయమైందని, ఆమెను హాస్పిటల్‌లో చేర్చామని, వెంటనే బయలుదేరి రమ్మని ఓ పోలీసు అధికారి ఆమెకు ఫోన్‌లో చెప్పాడు.

కల్పన భోరున ఏడవసాగింది. కొంతసేపు ఏడ్చి, తర్వాత భర్తకు ఫోన్ చేసి విషయం చెప్పింది. తర్వాత ఇంటికి తాళం వేసి బయటకు కదిలింది.

ఎదురుగా ప్రక్క ఫ్లాటు అబ్బాయి అతని ఇంటి తాళం తీస్తూ కనిపించాడు. అతన్ని చూడగానే ఆమెకు ప్రాణం లేచి వచ్చింది.

"బాబూ... బాంబు ప్రేలుళ్ళలో మా అమ్మాయి గాయపడింది. నేను హాస్పిటల్‌కి వెళ్తున్నాను. నాకు సాయంగా నువ్వు రాగలవా? అక్కడి గందరగోళంలో నా బిడ్డ ఎక్కడుందో నేను తెలుసుకోలేను" అంది కన్నీళ్లతో.

"నేను యిప్పుడే బయటినుంచి వచ్చాను... సారీ!" అన్నాడు.

కల్పన అతనివైపు ఛీత్కారంగా చూసింది. 'నువ్వా ఓ మనిషివేనా? సాటిమనిషి ఆపదలో ఉంటే ఆమాత్రం సహాయం చెయ్యలేవా? నీకు అవసరమైతే మా సహాయం కావాలి. మాకు అవసరమైతే మాత్రం నీకేం సంబంధం లేదా?' అన్నట్లుంది ఆ చూపు.

ఇంతలో... శిరీష్ ఆమె దగ్గరికి వచ్చి "అమ్మా! సిటీలో గొడవలట... ట్యూషన్ వదిలేశారు!" అన్నాడు.

కల్పన వాణ్ణి అక్కున చేర్చుకుని "పద నాన్నా! సమయానికి వచ్చావు. అక్కయ్య హాస్పిటల్‌లో వుంది... మనం వెళ్లాలి!" అంది.

●

"అమ్మా! నా కాలు నయమౌతుందా? నేను మళ్లీ నడవగలనా?" మరుసటిరోజు ఉదయం హాస్పిటల్‌లో తల్లిని అడిగింది శిల్ప.

"తప్పకుండా నయమౌతుంది. నాలుగు రోజుల్లో చిన్న సర్జరీ చేస్తారట. అది చేసుకుంటే నెలరోజుల్లో నీవు నడవగలవని డాక్టరు నాతో చెప్పారు" అంది కల్పన.

కూతురి విషయం విని రాత్రే హాస్పిటల్‌కి వచ్చిన భర్తను చూడగానే ఎంతో ధైర్యమొచ్చింది కల్పనకు. కూతురికి తాను భయపడినంత పెద్దగాయం కాకపోవడం ఆమెకు ఎంతో రిలీఫ్ నిచ్చింది.

తర్వాత కూతురితో "నాన్న స్నానం చేసి వస్తానని ఇంటికి వెళ్లారు. ఆయన వస్తే యిక్కడే ఉండమను. నేను వెళ్లి కాఫీ తీసుకుని వస్తాను" అని ఫ్లాస్కు తీసుకుని బయలుదేరింది కల్పన.

హాస్పిటల్‌లోని లాన్‌లో పేషంట్ల బంధువుల కాలక్షేపం కోసం పెద్ద టీవీ పెట్టి ఉన్నారు. అందులో ప్రసారమవుతున్న వార్తల్ని నిలబడి చూడసాగింది కల్పన.

సిటీ పోలీసు కమీషనర్ ప్రజల్ని ఉద్దేశించి మాట్లాడుతున్నాడు...

"మీకు అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే తాకకండి. మా నంబరుకు ఫోన్ చేస్తే బాంబు డిస్పోజింగ్ స్క్వాడ్‌ని పంపిస్తాం. అలాగే మీ చుట్టుప్రక్కల కొత్త వ్యక్తులు కనబడితే, అనుమానం కలిగించేలా ప్రవర్తిస్తే... మాకు ఫోన్ చేయండి. మా ఫోను నెంబర్లు..."

ఆమెకు ప్రక్క ఫ్లాటు అబ్బాయి గుర్తొచ్చాడు.

'అవును... వాణ్ణి కాసేపు ఏడిపించాలి. తన పనే తప్ప ప్రక్కవాడి ప్రాణం పోతున్నా పట్టించుకోనివాడికి ఓ చిన్న శిక్ష పడాలి!' అనుకుంది.

ఎదుటివాడికి సహాయం చెయ్యడం తప్ప- కలలో కూడా ఎవరికీ అపకారం తలపెట్టని ఆమెకు మొదటిసారిగా శాడిజంతో కూడిన ఆలోచన వచ్చింది. వెంటనే బ్యాగు నుంచి పెన్ను తీసి టీవీలో కనిపిస్తున్న నంబర్లలో ఓ నంబర్ని అరచేతిపై రాసుకుంది.

తర్వాత హాస్పిటల్ కాంపౌండులోనే ఉన్న క్యాంటీన్‌ను దాటుకుని రోడ్డు మీదికొచ్చింది. ఎదురుగా కాయిన్ బాక్స్ ఫోన్ కనిపిస్తే అటువైపు నడిచింది.

●

"ఏమిటమ్మా... అంత టెన్షన్‌గా కనిపిస్తున్నావు? సిటీలో మళ్లీ బాంబు ప్రేలుళ్ళా?" అని శిల్ప అడిగింది- తల్లి ముఖంలో ఆందోళనని గమనించి.

'అవును... టెన్షనే మరి! పోలీసులను చూస్తేనే జడుసుకునే తను పోలీసులకు తప్పుడు సమాచారం ఇచ్చింది. ఈపాటికి వాళ్ళు ప్రక్క ఫ్లాటు అబ్బాయిని అరెస్ట్ చేసివుంటారు. ఏం చెబుతూంటాడు అతను? పోలీసుల కాళ్లు పట్టుకుని తనకు ఏ పాపమూ తెలియదని అంటూంటాడా?' అనుకుంది కల్పన.

"ఏమిటమ్మా మాట్లాడవు?"

"ఏం లేదమ్మా... మన ప్రక్క ఫ్లాటు అబ్బాయి గురించి ఆలోచిస్తున్నాను" అంది కల్పన తను పోలీసులకు ఫోన్ చేసిన విషయం భర్తకూ, కూతురికీ చెప్పకూడదని ఆమె నిర్ణయించుకుంది.

"ఏం చేశాడు నీ ఫ్రెండు?"

"ఛ... అతన్ని ఫ్రెండు అనకు. ఆ పదానికున్న విలువ పోతుంది."

"ఏం చేశాడో చెప్పు మరీ?" ఆత్రుతగా అడిగింది శిల్ప.

తను హాస్పిటల్‌కి తోడు రమ్మని కోరితే అతను రానన్న విషయం చెప్పింది కల్పన.

"అందుకే అమ్మా... నిన్ను అందర్నీ నెత్తికెక్కించుకోవద్దని చెప్పేది! ఈ కాలం మనుషులకు ప్రక్కవారిని వాడుకోవడం తెలుసు. వాడుకున్నాక కరివేపాకులా తీసిపారేయడం

తెలుసు. కృతజ్ఞత, ఋణం తీర్చుకోవడం లాంటివి వారికి తెలియదు. ఇప్పటి మనుషుల డిక్షనరీలో ఆ పదాలు లేవు."

"పోనీలే! ఆరోజు నేను సహాయాలు చేయడం వల్లే ఈరోజు అతని మనస్తత్వం నాకు తెలిసింది. ఇకపై అతన్ని కాస్త దూరంగా ఉంచుతాను" అంది కల్పన.

మధ్యాహ్నం భర్తతో కలిసి భోజనానికి క్యాంటీన్‌కి వెళుతున్న కల్పన టీవీలో వస్తున్న వార్తలను నిలబడి ఆసక్తిగా చూడసాగింది.

"పద వెళదాం... సిటీలోని వార్తలన్నీ నీకే కావాలి!" అన్నాడు ఆమె భర్త హేమంత్.

"పదండీ..." అంటూ కదలబోయిన కల్పన 'బ్రేకింగ్ న్యూస్' అంటూ తాజావార్తల్ని పెద్దపెద్ద అక్షరాలతో వేస్తూంటే చూసి షాక్ తిన్నట్టు నిలబడిపోయింది. ఆమె ఎందుకలా అయిందో అర్థంకాక టీవీ స్క్రీను వైపు చూశాడు ఆమె భర్త.

"ఓ అజ్ఞాతవ్యక్తి ఫోన్‌కాల్ ఆధారంగా దిల్‌సుఖ్‌నగర్ కీర్తన అపార్టుమెంట్స్‌లోని ఓ ఫ్లాటుపై పోలీసుల దాడి! ముగ్గురు వ్యక్తుల అరెస్టు!! అందులో ఓ వ్యక్తి స్త్రీ! నిన్నటి బాంబుప్రేలుళ్ళకు సంబంధించిన కాగితాలు, సీడీలు, హార్డ్‌డిస్క్ స్వాధీనం! ఆ ఫ్లాటులో ఎవరు నివసిస్తున్నారో తమకు తెలియదనీ, ఆ వ్యక్తుల్ని మొదటిసారిగా తాము యిప్పుడే చూశామనీ చెప్పిన అపార్ట్‌మెంటు వాసులు!"

కల్పన నివ్వెరపోయింది. హేమంత్ ఆశ్చర్యపడలేదు. ఆలోచిస్తున్నాడు.

ఉగ్రవాదులు ప్రజల మధ్యలో నివసిస్తూనే ఎలా తమ కార్యకలాపాలు సాగించగలుగుతున్నారో అతనికి ఆ క్షణాన అర్థమైంది.

'ఎవరి గురించి ఎవరికీ పట్టని జనం తత్వమే వాళ్ళను రక్షిస్తోంది' అనుకున్నాడు. ఆ ఉగ్రవాదుల్ని పోలీసులకు పట్టించిన అజ్ఞాత వ్యక్తిని మనసులోనే అభినందించాడు.

●

'ఆంధ్రభూమి' వారపత్రిక ... 9 అక్టోబర్' 2008 సంచికలో ప్రచురితమైన కథ

తమ రచనలను పుస్తకరూపంలోకి తీసుకురావాలన్న ఆసక్తి, అభిలాష
ఉండికూడా ప్రచురణకి అయ్యే ఖర్చుని చూసి వెనుకంజ వేస్తున్న
వర్ధమాన, అనుభవజ్ఞులైన రచయితలకు ప్రచురణ వ్యయంలో వెసులుబాటును కల్పిస్తూ...

**జయంతి పబ్లికేషన్స్**

రూపొందించిన ప్రచురణ విధానాల గురించిన పూర్తి వివరాల కోసం
రూ॥ 5/- స్టాంపు అంటించిన కవరును జతపరచి మా అడ్రసుకి వ్రాయండి.